క్లుప్తంగా

గోశాలకు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లను అందజేస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్: కర్నూలు జిల్లా పెద్దటేకూరు గ్రామ శివార్లలో వెలసిన పాండురంగస్వామి గోశాలకు దాతల సహకారంతో డోన్ స్ఫూర్తి సేవా సమితి సభ్యులు ఫ్యాన్లను అందజేశారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం గోశాలను సందర్శించి పీఠాధిపతి ఎల్లస్వామికి ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకులు సీసంగుంతల మధు, సభ్యులు కోచ్చెర్వు నారాయణస్వామి, చంద్ర, భాస్కర్, వెల్దుర్తి హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరిసింహనాయుడు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

అవుకు: స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను ప్రారంభించారు. రోగులకు వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. నంద్యాల డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్ వైద్యులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

బనగానపల్లె రూరల్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పలు సమస్యలపై ప్రజలు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి అర్జీలను సమర్పించారు. బుధవారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆయనకు అర్జీలు అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

డోన్ టౌన్: సమాజంలో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డీఓ నరసింహులు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం బాల్య వివాహాల నివారణ కార్యక్రమాలపై పలు శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అరిష్టాలను ప్రజలకు వివరించాలని, బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. ఈ విషయం ప్రజలకు తెలియజేస్తూ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మమ్మద్‌హనీఫ్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



అయ్యప్ప స్వామి ఆలయంలో విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల : స్థానిక నంద్యాల రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానానికి పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన పాశం వెంకటేశ్వర్లు, లక్ష్మిదేవి దంపతుల కుమారుడు వెంకటరమణ, జ్యోష్ణ దంపతులు రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో దాతలతో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేవతా వస్త్రాల వితరణ



ఈఓ, పండితులకు వస్త్రాలు అందిస్తున్న తిరుపాల్‌రెడ్డి దంపతులు

మహానంది: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లతో పాటు మహానందిలోని గరుడనంది, వినాయకనంది ఆలయాల్లో కొలువైన మూల, ఉత్సవమూర్తులకు అవసరమైన దేవతా వస్త్రాలను దాతలు బుధవారం అందించారు. ధర్మవరం పట్టణానికి చెందిన గోరకాటి రఘునాథరెడ్డి, ప్రమీల దంపతులు, వారి కుమార్తెలు స్వప్నారెడ్డి, పూర్ణిమరెడ్డి వేదిక వస్త్రాలు, కలశ వస్త్రాలు, ధ్వజారోహణ వస్త్రాలను ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధానిలకు దాతల తరఫున ఐకేపీ ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, సౌజన్య దంపతులు అందించారు.

సనాతన ధర్మం గొప్పది



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: హైదవ సంస్కృతి, సనాతన ధర్మం గొప్పదని, వీటిని పరి రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. స్థానిక సాంబ శివాలయంలో బుధవారం కళ్లె వంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ వితరణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలు, పండుగలు సంస్కృతికి చిహ్నాలన్నారు. పంచాంగాలను ప్రతి సంవత్సరం పండితులకు అందిస్తున్న కళ్లె వంశస్తులను అభినందించారు. అనంతరం పట్టణానికి చెందిన పలువురు బ్రాహ్మణులను సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు రమ్యశిల్ప, మాధవి, సాంబ శివాలయం ప్రధాన అర్చకులు కళ్లెశేషావలిశర్మ తదితరులు ఉన్నారు.



బేతంచెర్ల నుంచి ఇరుముడులతో శ్రీశైలానికి వెళ్తున్న శివ మాలధారులు

శ్రీశైలానికి పాదయాత్ర

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన 15 మంది శివమాల స్వీకరించిన స్వాములు బుధవారం ఇరుముడులు ధరించి శ్రీశైలానికి తరలివెళ్లారు. ముందుగా గ్రామంలోని రామేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు భాస్కయ్య వారిచే ప్రత్యేక పూజలు చేయించి ఇరుముడులు ధరింపజేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు మధు, బాలకృష్ణ, పరమేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, రామకృష్ణుడు మాట్లాడుతూ.. వెంకటాపురం గ్రామం నుంచి పాదయాత్రగా శ్రీశైలం వెళ్లి అక్కడ దీక్ష విరమణ గావించనున్నట్లు తెలిపారు.

ఇరుముడులతో శ్రీశైలానికి శివస్వాములు

బేతంచెర్ల : మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలో శివదీక్ష స్వీకరించిన మాలధారులు ఇరుముడులను సమర్పించేందుకు బుధవారం శ్రీశైలానికి బయలు దేరి వెళ్లారు. పట్టణంలోని సిద్దేశ్వర స్వామి, నంద్యాల రహదారిలోని దుర్గా మల్లేశ్వర స్వామి, జటాధరస్వామి, పూదోట మఠం, శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయాల్లో గురుస్వాములు నారాయణ స్వామి, బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు కట్టుకొని శ్రీశైలానికి బయలు దేరారు.



పలుకూరు నుంచి బయలుదేరుతున్న శివస్వాములు

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని కటికవానికుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం సుంకుల పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లెల్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు వెంట ఉన్నారు.

ఘనంగా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట



దక్షిణామూర్తి స్వామి

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన దక్షిణామూర్తి, మహాగణపతి, నవనాగేంద్రుల విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. వేదపండితులు కాణిపాకం లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చివరి రోజు వేదమంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు కోర్నపల్లె చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠను పురస్కరించుకొని భక్తులకు అన్నదానం చేశారు. పెట్నికోటకు చెందిన సీతారామాంజనేయస్వామి భజన బృందం సభ్యులు భజన గీతాలు ఆలపించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న ఆత్మ పీడీ రత్నప్రసాద్

బనగానపల్లె: రైతులు వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, తద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడి సాధించాలని ఆత్మ పీడీ రత్నప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో పంటల్లో వ్యాపించే చీడపీడల నివారణపై అవగాహన పెంచుకోవాలన్నారు. సిఫార్సు చేసిన పరిమితి మేరకే ఎరువులను వాడాలన్నారు. ఫర్టిలైజర్స్ షాపుల వద్ద ధరల బోర్డులను ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం సమగ్ర చీడపీడల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం డిప్లొమా పొందిన వారికి పట్టాలను అందజేశారు. కేవీకే ఏఓ సురేష్‌కుమార్, దేశీ ప్రోగ్రాం అధికారి విశ్వనాథ్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారి మధుమతి, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

'సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హర్ ఘర్.. సూర్య ఘర్ పథకంపై బుధవారం పట్టణంలో కర పత్రాలు అందజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవడం ద్వారా కరెంటు బిల్లు ఆదాతో పాటు మిగులు విద్యుత్‌ను సరఫరా చేయడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. సూర్య ఘర్ పథకం కింద ఏర్పాటు చేసుకునే వారికి రూ.78వేల సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఈ కుషిధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, జూనియర్ లైన్‌మెన్ ఉచ్చారెడ్డి, ఆపరేటర్ పురుషోత్తం తదితరులు ఉన్నారు.

అలేబాదులో ముగిసిన దేవర



కొలువు తీరిన గ్రామ దేవతలు

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో దేవర మహోత్సవం బుధవారంతో ముగిసింది. గ్రామంలో వెలసిన పెద్దమ్మ, మారెమ్మలకు గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ, మారెమ్మలకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజులుగా గ్రామంలో దేవర సందర్భంగా సందడి నెలకొంది.



మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

దేవరలో పాల్గొన్న ప్రముఖులు

మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో బుధవారం నిర్వహించిన దేవరకు వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు తరలివచ్చారు. హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు హాజరయ్యారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి ప్రత్యేక ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బాలయ్య, ప్రకాశమయ్య, ప్రవీణ్ కుమార్, ఆనంద్‌కుమార్, అయ్యన్న పాల్గొన్నారు.

రుణ దరఖాస్తుల పరిశీలన

సంజామల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ బ్యాంకు శాఖల మేనేజర్లతో ఎంపీడీఓ సాల్మన్ సమావేశం నిర్వహించారు. సంజామల మండలానికి 59 యూనిట్ల రుణాలు మంజూరు కాగా వాటి కోసం 482 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తులను బ్యాంకు మేనేజర్లతో కలిసి ఎంపీడీఓ మొదటి పరిశీలన నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్లు సురేష్, గంగాధర్, రాఘవేంద్ర, వేల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

కోవెలకుంట్ల: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు బుధవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో వివిధ రకాల యూనిట్‌ల కోసం నమోదు చేసుకున్న వారంతా ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.



బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

శ్రీశైలం.. భక్తి పారవశ్యం



శివదీక్షా శిబిరంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి శివదీక్షా జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఉదయం మనోహరగుండం వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను రథవీధిలో మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఊరేగింపుగా తీసుకునివెళ్లి శివదీక్షా శిబిరాలలో ఆశీనులను చేయించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచారాలతో పూజాదికాలు నిర్వహించారు. శివదీక్షా జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమం పూర్తయ్యేంత వరకు కూడా శిబిరాలలోని దేవతా మూర్తులకు త్రికాలాలలో శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపారు. అనంతరం దీక్షా శిబిరాలలోని హోమగుండానికి అర్చకస్వాములు శాస్త్రోక్తంగా పూజలను జరిపి హోమాగ్నిని ప్రజ్వలింపజేశారు. తరువాత శివదీక్షాధారులు నమశ్శివాయ పంచాక్షరీ నామస్మరణతో శివదీక్షా జ్యోతిర్ముడి సమర్పణ కార్యక్రమం ప్రారంభించారు. జ్యోతిర్ముడి సమర్పణానంతరం ఆవునెయ్యి, నారికేళం, మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా భక్తులు సమర్పించడం జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం మార్చి దవ తేది వరకు దీక్షావిరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జనవరి 19న శివమండల దీక్షను, ఫిబ్రవరి 8న అర్ధమండలదీక్షను స్వీకరించిన భక్తులు ఈ దీక్షా విరమణ సమయంలో జ్యోతిర్ముడిని (ఇరుముడిని)సమర్పిస్తారు.

జ్యోతిర్ముడి కలిగిన భక్తులకు స్పర్శదర్శనం

శివదీక్షను స్వీకరించి, జ్యోతిర్ముడి కలిగిన భక్తులకు చంద్రవతి కల్యాణ మండపం నుండి ఆలయ తూర్పు మాడవీధి ద్వారా ప్రత్యేక దర్శనం క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఈ క్యూలైన్ ద్వారా నిర్ణీత వేళలలో మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నారు. ఈ నెల 23వ తేది వరకు ఐదు రోజులు మాత్రమే మల్లన్న స్పర్శదర్శనం కలిస్తారు. శివదీక్ష భక్తులకు సేవలందించేందుకు సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.



జ్యోతిర్ముడి సమర్పిస్తున్న శివదీక్షా భక్తులు

మద్యం విక్రేత అరెస్ట్

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన అవులకుంట్ల పెద్ద ఎల్లయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో అవులకుట్ల పెద్ద ఎల్లయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకొని తనిఖీ చేసినట్లు తెలిపారు. అతని వద్ద పది క్వార్టర్ల బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్లకుంట గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వరిని డోన్ మండలం గుమ్మకొండ గ్రామానికి చెందిన కుపేంద్రకు ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని రోజులుగా భార్య వెంకటేశ్వరిపై అనుమానంతో భర్త కుపేంద్ర, అత్త, మామ రామలక్ష్మి, రామాంజనేయులు శారీరకంగా మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల: విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా పట్టణంలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య గురువారం తెలిపారు. పట్టణంలోని వడ్డెపేట, డ్రైవర్స్ కాలనీ, గౌరిపేట, బోయపేట కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పేదలకు అన్నదానం

డోన్ టౌన్: అమెరికాలో పుట్టిన రోజు జరుపుకుంటున్న చిన్నారి నందన సహస్ర తల్లిదండ్రులు నంద కళాధర్, సుహాసిని దంపతుల ఆర్థిక సహకారంతో బుధవారం ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో యాచకులకు, పేదలకు, ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు రిటైర్డు హెచ్‌ఎం గ్రేసమ్మ, కళావతి ఉన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి



బేతంచెర్ల పట్టణంలో ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని వికాస భారతి కార్యాలయంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి వికాస భారతి సంఘటన కార్యదర్శి బీవీ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సిమెంట్ నగర్ గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ, భజరంగదళ్ సభ్యుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మారుతి కృష్ణ, గౌరి హుసేన్‌రెడ్డి, గుండా గోపాల్, మధు మోహన్ రెడ్డి, నాగ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- ప్యాపిలి: స్థానిక సరస్వతి శిశు మందిరంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ శివాజీ హిందూ సామ్రాజ్య స్థాపనకు ఎనలేని కృషి చేశారన్నారు. మహిళలను గౌరవించాలని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసు తదితరులు పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్‌గౌస్

బనగానపల్లె రూరల్: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్‌గౌస్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బడేసాహెబ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ.. శివాజీ మహారాష్ట్ర అస్తిత్వాన్ని బలంగా ప్రదర్శించి, ఎంతో బలవంతులైన మొగలులు, బీజాపూర్ రాజ్యాలతో పోరాటం చేసి స్వరాజ్యం పేరుతో మహారాష్ట్ర నిర్మాణం చేసినట్లు వివరించారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్‌ను సైతం గౌరవించి లౌకిక పాలకుడుగా పేరుగాంచినట్లు తెలిపారు. డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

డోన్ టౌన్ : బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో (గెస్ట్ హౌస్) గురువారం బ్యాంక్ అధికారులతో గ్రామాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ కాశీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చిన్న మల్కాపురం, పెద్ద మల్కాపురం, వలిసెల, కమలాపురం, యు.కొత్తపల్లె, సీసంగుంతల, ఉంగరానిగుండ్ల, యాపదిన్నె, మల్లియాల, బి.రామదుర్గం, ఎద్దుపెంట, తాడూరు, అనుంపల్లె, మిద్దేపల్లె, దేవరబండ, రేకులకుంట, ఓబులాపురం, దొరపల్లె, గోసానిపల్లె, యర్రగుంట్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 21న మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉడుములపాడు, జగదుర్తి, తాటిమాను కొత్తూరు, కొచ్చెర్వు, ధర్మారం, మల్లెంపల్లె, వెంకటాపురం, అబ్బిరెడ్డి, బొంతిరాళ్ళ, గుమ్మకొండ, వెంకటనాయునిపల్లె, కామగానికుంట్ల, సోంపురం, తిమ్మాపురం, ఆవులదొడ్డి, చింతలపేట, కొత్తకోట, కొత్రాయి, కొత్తబురుజు, ఎస్ గుండాల గ్రామాల వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి చనుగొండ్ల, ఇందిరాంపల్లె గ్రామాలకు సంబంధించిన వారు హాజరుకావాలన్నారు. దరఖాస్తుదారులు వారికి కేటాయించిన రోజున మాత్రమే హాజరు కావాలని సూచించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ ముర్తుజావలి(51) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలేకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఏఎస్‌ఐ రామచంద్రుడు తెలిపిన వివరాలు.. ఈ నెల 8న పటేల్ సెంటర్‌లో కుమార్ మొబైల్ షాపు ఎదురుగా సైకిల్‌పై వెళ్తున్న టైలరు షేక్ ముర్తుజావలి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.

ప్రతి కార్మికుడు ఈ– శ్రామ్‌లో నమోదు చేసుకోవాలి

డోన్ టౌన్: అసంఘటిత రంగంలో పని చేసే ప్రతి కార్మికుడు ఈ– శ్రామ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకొని ప్రయోజనాలు పొందవచ్చని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌ఏ చిన్న రహిమాన్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మికశాఖ అమలు చేస్తున్న ఈ పథకం కింద వ్యవసాయ అనుబంధరంగ పనులు చేసే కూలీలు, సన్న, చిన్నకారు రైతులు, నర్సరీలు, పాడీపరిశ్రమ, ఉద్యానతోటలు, మత్స్యకారులు, భవన నిర్మాణ కూలీలు, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీల కార్మికులు, టైలరింగ్, డ్రైవర్లు, హెల్పర్లు, చేనేత, కుమ్మరి తదితర కులవృత్తులు చేసే వారు, ఉపాధి కూలీలు, ఇన్‌కం టాక్స్ చెల్లించని వారు అర్హులన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో గ్రామ, వార్డు సచివాలయాల్లో, కార్మికశాఖ కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మామిడికి ఫ్రూట్ కవర్ల రక్షణ



మామిడి కాయలకు కవర్లను ఏర్పాటు చేసుకున్న దృశ్యం

ప్యాపిలి: పిందె దశలో ఉన్న మామిడి కాయలకు ఫ్రూట్ కవర్‌లను ఏర్పాటు చేయడం ద్వారా మరింత నాణ్యతతో కూడిన మామిడి పండ్లను పొంద వచ్చని ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి అన్నారు. ప్యాపిలి మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో పలువురు రైతులు మామిడి కాయలకు ఏర్పాటు చేసిన ఫ్రూట్ కవర్లను ఆమె పరిశీలించారు. ఉద్యానశాఖ అధికారిణి మాట్లాడుతూ మామిడి రైతులకు ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీపై ఫ్రూట్ కవర్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కవర్ ధర రూ. 2 కాగా 50 శాతం రాయితీతో హెక్టారుకు రూ. 10 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కాయలు కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడే వీటిని కాయలకు అమర్చాలన్నారు. గాలి చొరబడకుండా తొడిమ వరకు ఏర్పాటు చేయడం ద్వారా పురుగుల నుంచి రక్షణ ఉంటుందన్నారు. సూర్యరశ్మి, వడగండ్ల నుంచి కూడా కాయలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఫ్రూట్ కవర్లు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం, ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.